# పరాయివాడి పెళ్ళాం

అడ్డంగా పొట్టిగా కుదిమట్టంగావున్న పాతకుర్చీలో కూర్చొని, రెండు చేతుల్తోనూ గళ్ళులుంగీని గజ్జలసందుకు తోసి ఎడంకాలును వీర్రాజు కొంచెం పైకెత్తాడు.

అలా ఎత్తిన ఎడం పాదాన్ని తన మోకాటిచిప్పపైఆన్చి-ఆవదంరాస్తూ, వేళ్ళు విరుస్తూ హాయిగా కూర్చుండి పోయింది ఆదెమ్మ. అలా ఆవదం రాస్తున్నప్పుడు వేళ్ళు విరుస్తూ- చిటుకు చిటుకు మనిపిస్తున్నపుడు ఆమె ఎత్తు గుండెలు ఆముదం రాసిన వీర్రాజు పాదాలకు తగిలాయో లేదో ఆ పరమాత్ముడి కెరుక... ఆదెమ్మ పతివ్రత కాదు. వీర్రాజు ఆమె భర్తకాడు. ఆమె ఏదో గునుస్తోంది. ముందుకూ వెనకకూ వూగిసలాడుతోంది. మధ్యమధ్యన కారాకిళ్ళీ నవిలినందున గారకట్టిన పళ్ళతో మనకి వికృతంగానూ, వీర్రాజుకి వుల్లాసంగానూ 'ఫీలింగు' యిచ్చేలా నవ్వుతోంది.

రావణాసురుడి లంకలావున్న ఆ బిల్డింగు ప్రహరీగోడ కవతలనుంచి మబ్బు లేని పిడుగులాటి కేక వినిపించింది.

"నా పెళ్ళాన్ని నాకిచ్చీరా...నాకిచ్చి" ఆదెమ్మ మొహం నల్లబడింది! వీర్రాజు రక్తంకుతకుతలాడింది. వీర్రాజు కుర్చీలోంచి లేవలేదు. వీర్రాజులు కుర్చీల్లోంచి లేవడు. లేవనక్కరలేకుండానే పరాయివాడి పెళ్ళాంచేత అరికాలికి ఆముదం రాయించుకోగలడు.

"తాగుబోతెదవ- తాగుబోతెదవ" అని మెటికిలు విరిచి తన మోకాలిమీద ఆన్చివున్న వీర్రాజు ఎడమపాదాన్ని కుడిచేత్తో అలవోకగా నేలమీద పరిచిన పాత టర్కిష్ తువ్వాలుముక్క మీదకు దించి, ముష్కరతురుష్కులు రాజాంతఃపురాలపై దాడి జరిపినప్పుడు లోనికి పారిపోయే అంతఃపురకాంతలా బెంబేలుపడుతూ లోనికి దారి తీసింది ఆదెమ్మ.

"నా పెళ్ళాంముండ ఇంట్లో దాక్కోనుంది దాన్నిలా బయటకు రమ్మను. శర్మం వొలిసేత్తాను" అని మళ్ళీ కేక.

వీర్రాజు నవ్వుకున్నాడు. తిండి పెట్టలేని వెధవ పెళ్ళాం ముండమీద ఎంత అథార్టీ చలాయిస్తున్నాడో అని కాదు నవ్వు ఆదెమ్మ లేకపోతే తనకు గడవదు. వాడికి గడుస్తుంది. తను ఆ "ఆదెమ్మ ముండ"ని పోషిస్తున్నాడు. వాడు పోషించటంలేదు. వాడు దాని మొగుడైనంతమాత్రాన వాడి కేకలు చెల్లవు. అరుచుకుని అరుచుకుని వాడే వూరుకుంటాడు! మళ్ళీ కేక.

"నా పెళ్ళాన్ని నీ ఇంట్లో దాక్కోపెట్టడానికి నువ్వెవడివిరా ఎదవా?"

అనేశాడు. అంతమాటా అనేశాడు. వీర్రాజు కుర్చీలోంచి లేచి, ఇనుపగేటు తోసుకుని వీధిలోకెళ్ళి ఆ ఆదెమ్మ మొగుడిగాడిని ఈ లెంపా ఆ లెంపా వాయగొట్టి "పోరా పో నీకు దిక్కున్నచోట చెప్పుకో- నీ పెళ్ళాం నా ఇంట్లోలేదు" అని అనగలిగేవాడే...కాని, కాలికి ఆముదం రాసుకున్నాడు. పైగా యిందాక ఆదెమ్మచేత వెనకనుంచి ఆముదంతో ముదంగా వీపు తోమించుకున్నప్పుడు బుష్షర్టుని బోగన్‌విల్లా పందిరిగెడకి వేలాడేశాడు. అందులో ఒక రూపాయి, కొంత చిల్లరా వుండాలి. అదికాని ఆదెమ్మ ముండ చెక్కేసిందేమో...అది ఆవదం రాస్తూ "సినిమా కెళ్ళడానికే అన్ని గునుపులూ గుఱుస్తోంది....డబ్బు లడగడానికే "అయ్యగోరి కాల్ని మోకాలి మీదెట్టేసుకుని ముందుకీ వెనక్కీ వొంగి గారపళ్ళతోనవ్వుతూ చవకగా గుండెల్ని పాదానికి తాకిస్తూ బేరమాడుతోంది. వీర్రాజుకి నీతిజాతీ లేని అలగా వెధవలమీద కోపం వచ్చిందంటే రాదూ... లేవాలి. లేవాలి. కుర్చీలోంచి లేవడమా పందిర గడకున్న చొక్కాని తొడగటమా- డబ్బు తీసిందేమోనని ఆదెమ్మని రొకాయించటమా లేక వీధిలోకెళ్ళి దాని నిజ భర్తతో కలబడిపోరడమా?

అలాటి టైంలో పై డాబామీంచి రాజుబాబుగాడు దిగాడు. దిగీదిగడం అమెరికావాడి అపోలో పసిఫిక్ మహాసముద్రంలోకి దిగినట్టు ఆదెమ్మ మొగుడి గుండెలమీదకు దిగి ఈ లెంపా ఆ లెంపా వావాగొట్టి రెండు కాళ్ళతో కుమ్మి.

"ఆ మేడబాబుని అంతలేసి మాటలంటావుట్రా లంజికొడకా- నీ నాలుక చీరుస్తాను వాగావంటే- నోరు మూసుకుని పడుండు" అని రోడ్డుపక్క చెట్టు క్రిందకి ఈడ్చేసి 'విజిల్' వేసుకుంటూ వెళ్ళిపోయాడు హైరోడ్డెక్కి. ఆ దృశ్యాన్ని మేడలమీదనించీ, డాబాలమీదనించీ, అరుగులమీదనించీ. వినీలకుంతలాలను ఆరబెట్టుకుంటూ, చంకలో పిల్లకి పాలు కుడుపుతూ చూస్తున్న ఆడవాళ్ళంతా "రాజుబాబు" ప్రవర్తనని హర్షించలేక "అదెందుకు అక్కడ దాక్కోటం" అని అన్నవారేగాని "వీడెందుకు తాగి యిల్లా అరవటం" అని ఒక్కరూ అనలేదు. పైగా రాజుబాబుగాడు సాక్షాత్తూ తండ్రిని దుర్భాషలాడుతూ కాలితో తన్ని రోడ్డుపక్క చెట్టుక్రిందకీడ్చేయటం- హేవీ మర్యాదగా లేదు. తండ్రి ఆజ్ఞ మేరకు పద్నాలుగేళ్ళు అరణ్యావాసంచేసి ఆలికిసైతం అగ్నిపరీక్ష పెట్టిన రాముడ్ని ఆరాధించే

స్త్రీలు- రాజుబాబు  తండ్రిని కాలితో కుమ్మటాన్ని అదెమ్మ అంతఃపురకాంతలా వ్యవహరించటాన్ని చూసి కొంచెం బాధపడ్డారు.

మురికికాలవ పక్క చెట్టుకింద పడుకున్న ఆదెమ్మ మొగుడు- "పైకిరాయే లంజా సంపేస్తా- మొగుడికి కూడెట్టని లంజా- కొడుకుచేత కొట్టిస్తాయేం...కొడుగ్గదాని సూసీ సూడనట్టూరుకున్నా- ఆడ్నీ నిన్నూ నీ రంకుమొగుళ్ళనీ పచ్చడిచేసేత్తానే- ఎదవా ఎదవన్నరెదవా నా పెళ్ళాన్నొగ్గీ-నువ్వెవుడివిరా నా పెళ్ళాన్నింటో దాచుకొని లేదని సెప్పడానికి" అని అరుస్తూ యాగీ ప్రారంభించాడు పడుకునే. అలానే మేడలమీద తల్లులకు "తల్లులారా సబువు సెప్పండి. ఆడింట్లో నా పెళ్ళాం దాక్కుంది. దాన్నొగ్గీమనండి. నా పెళ్ళాన్ని నాకిచ్చీమనండి" అని దండాలు పెట్టాడు.

"ఇస్తే ఏం చేస్తావురా?" అని చిల్లరదుకాణం షావుకారు సిజర్ సిగరెట్టు దమ్ములాగుతూ కళ్ళతో నవ్వుతూ కాలితో చెత్తబుట్టని మురికి కాలవలోకి తంతూ "యింట రెస్టింగు"గా అడిగాడు.

"పొడిచేస్తాను."

"ఎలా"

"ఇలా దాని గుండెల్లో ఖస్‌మని దించేస్తాను కత్తి" అని కత్తి దాని గుండెల్లోకి ఎలా దించుతాడో చేత్తో అభినయించి చెప్పాడు.

షావుకారికి వూరితగూల్ని వుట్టినే ఎగసన దోయడం సరదా.

"పోరా-నువ్వు దానికి తిండెడతావా? గుడ్డ ఎడతావా? దాన్ని పోషిస్తావా? పోషించలేనప్పుడు ఆడది దాని బతుకది బతుకుతూంటే ఈ అల్ల రేటి? ఆగవేటి? చేశావంటే పోలీసుల్ని పిలిపించి జయిల్లో తోయించాలిసొస్తుందిరోయ్'' అని దమ్ములాగుతూ- 'న్యూసెన్స్' తాగొచ్చి రోజూ యిక్కడ 'న్యూసెన్స్' అన్నందుకు ఆ పాయింటుకి సపోర్టుకోసం అటూ యిటూ చూశాడు.

ఆదెమ్మ మొగుడు అసిరిగాడికి తాగుడు మైకంలో కూడా లోకంలోవున్న అధర్మవంతా షావుకారి సిజర్ సిగరెట్టు దమ్ములో కనపడినట్టుంది. పాముద విష్ణుమూర్తిలా అలా వేపచెట్టు కింద పడుకుని.

"పరమేస్వరా యిదేటిలాటి మాటలంటాడీ షావుకోరు. నా పెల్లాన్ని నా దగ్గరికి రమ్మనటం నూసెన్సా... చెప్పండి తల్లులారా? పోలిసాళ్ళని పిలుస్తారా? పోలీసోడేటి సబువు చెప్పగల్డిందులో -నా పెల్లాన్ని ఆ మేడబాబు ఏలుకోటం సబువని పోలీసోడైతే మాత్రం అనగలడా మాట? నా ప్రోజల్లా రిక్షాలాగి. కూంతేసుకుని యింటి కొత్తే కూడెట్టాలా వొద్దా? ఓ కూరముక్కడేసి యింతన్నం పారేసి ఒకసాప ముక్క పరిత్తే నానేటంతానూ- తొంగురంతానే- నాన్డబ్బులియ్యనూ-ఒవురంతారా మాత-యియిగో," అని జేబులోంచి

చిల్లర డబ్బుల్తీసి గిరాటేశాడు షావుకారిమీద కోపంతో. మేడమీద వొాక మిడిలేజుడు సీతారత్నం "వాడితో ఏవిటి? వాడ్ని రెచ్చగొట్టకండి. అరిచరచివాడే పడుకుంటాడు" అని న్యూసెన్స్‌ను షావుకారివేపు తిప్పి హెచ్చరించింది.

అసిరిగాడు మేడకేసి తలతిప్పి "అమ్మగారో సూశారా! సావుకోరెలా అడ్డవోలుగా నా పెల్లాం ఆడింట్లో దాక్కోడం సబువని రూల్సు సెపతన్నాడో... ఈ అమ్మలంతా ఎందుకిలా ఆచ్చెర్యంపడిపోయి నిలబడి సూతా వున్నారు. ఎవుడి పెల్లాం ఆడెనక తలొంచుకుని నడిసెల్తే ఒవురీ వీధిలో నిలబడి సిత్రం సూసినట్టు సూత్తారా- సూడరు తల్లీ సూడరు. అదర్మం గనుకే తల్లులంతా ఏటీ అన్నేయవని అడగనేక మేడలమీద నిలబడి పోనారు. కన్నకొడుకు, గుంటెదవ, యీసేత్తో అన్నం తినిపించేను, శాకలెట్టు కొనుక్కోరా అని యీసేత్తో డబ్బులిచ్చేను, బుక్కులు కొనుక్కోరా బడికెల్లని యీ రిచ్చాలాగే సేత్తో రూపాయి కాయితాలిచ్చాను. ఆ నా ముద్దుల కొడుకు రాజుగాడేటి సేసాడో సూసేరా-గుండెలమీదతన్ని జుత్తట్టుకుని రోడ్డుమీదీడ్చి, ఈ మురిక్కాలవ పక్క సెట్టుకింద ఒగ్గీసేడు. గుంటెదవ-రాజుబాబుగాడెంత? నా ఈడ్సితంతే గుడ్లు తేలబెట్టియ్యగలడు. మనం తాగున్నావని కన్నకొడుకుని సంపుకుంతావా - సంపుకోం కానీ ఆడు- ఆ మేడబాబుతో కుమ్మక్కయి నన్ను తన్నమంటే తన్నీశాడు. ఈ అదర్మ వేటని ఈ అమ్మలంతా నిలబడి బుగ్గన ఏలేసుకుని సూత్తన్నారు. అవునా? కాదా? నాను రిచ్చావోడ్ని -తాగుబోతెదవను-మంచీ మరేదా తెలీని సవటను- నా నొప్పుగుంతన్నాను ఇలా తండ్రిని పదమూడేల్ల కొడుకు తన్ని జుత్తట్టుకు రోడ్డుమీద కీడిత్తే యీ అదర్మాన్ని సూత్తున్న మీ పిల్లలంతా మిమ్మల్నలాగే సేత్తే లోకం ఏటయి పోతాదోనని నాకు బెంగే..." అని గుండెలు బాదుకుంటూ అసిరిగాడు ఏడుపుకి లంకించుకున్నాడు. అలా వాడు ఏడుస్తుంటే చూడలేని ఒక లేత మనసు యిల్లాలు, పళ్ళెంలో అన్నంకూరా, చెంబుతో నీళ్లూ, గ్లాసులో మజ్జిగా పోసి వాడికి పెట్టమని పనిపిల్లను పంపించింది. అసిరిగాడి లెక్చర్ విన్న ఆడవాళ్ళంతా దీర్ఘంగా నిట్టూరుస్తూ-"ఆదెమ్మ ముండకి పొగరెక్కు"వయిందని తిట్టుకున్నాడు.

□

వీర్రాజుబాబుకి నెత్తిమీద వెంట్రుకలులేవు. ఉన్నవన్నీ ఆదెమ్మకు కిత కితలు పెట్టడానికే అన్నట్లు గుండెల మీదన్నాయి. అతన్ని చూడగానే చూసినవారికి బోర్లించిన రాగికాగుమీద తోమకుండా పెట్టిన కిలమారిన ఇత్తడి చెంబు గుర్తుకొస్తుంది. అతను అప్పుడప్పుడు షర్టు వేసుకుంటాడు. వీధిలోకి వెళ్ళినప్పుడు ముప్ఫయి అంగుళాల ప్యాంటు వేసుకుంటాడు. అతను షర్టు కాని ప్యాంటు కాని ధరించడం జేబుల అవసరంవల్లనే- అతను మాట్లాడినపుడు కేకలు పెట్టినట్లుంటుంది. నిజంగా కేకలు పెట్టినప్పుడు పిడుగులు పడ్డట్లుంటుంది. అతను హవాయి చెప్పులు వేసుకుంటాడు. అతని బరువుకి ఆ చెప్పులు నడవకుండానే

అరిగిపోయుంటాయి. వీర్రాజుబాబు రైల్వేలో ఇనస్పెక్ట రాఫ్ వర్క్చేసి కంట్రాక్టర్లదగ్గర పెర్సంటేజి కమీషనూ, దస్టు సిమ్మెంటు అమ్మి లాభాలూ గడించి తెగ బలిశాడు. కాని యాంటీకరప్షన్ అనగా అవినీతి నేర నిరోధక శాఖవారికి దస్టు సిమ్మెంటు అమ్మకంలోకాక, పెర్సంటేజి కమీషన్లలోగాక మరొక కేసులో దురదృష్టకరంగా దొరికిపోయాడు. అంటే అతనికోసం పన్నిన వుచ్చుల్లోకి అభిమన్యుడిలా నడిచివెళ్ళి అక్కడ చిక్కుకుపోయాడు. దాన్ని "దొంగ మస్తర్ల కేసని" ముద్దుగా పిలుచుకుంటారు. దొంగమస్తర్ల కేసు డిపార్టుమెంటు వారిది కావటంవలన అందులోంచి పైకి లాగటం చాలా సుళువనుకుని ముందు ఉపేక్షించి తరవాత అది బిగుసుకుపోగా "వీర్రాజుబాబు" తాను తవ్వుకున్న గోతిలో పూర్తిగా కప్పడిపోయాడు.

దొంగమస్తర్ల కేసంటే- ఎస్టిమేట్లలో "వర్క్ చార్జి ఎస్టాబ్లిష్మెంట్" అని సిబ్బంది ఖర్చుకు శాంక్షన్లు యిస్తారు. ఈ ఎస్టిమేట్లలో పదిమంది కూలీలు అవసరమైతే వందమంది కావాలని రాస్తారు. వందమంది శాంక్షనయితే పదిమందిచేత పనిచేయించి తొంభై మందికి వేలుముద్దర్లు వేయించి అలాలేని తొంభైమంది చొప్పున దొంగమస్తర్లు జీతాలబిల్లులు తయారు చేసి మూడేళ్ళపాటు ఆ డబ్బు వీర్రాజుబాబు కైంకర్యం చేశాడు. అలాటి మస్తర్లు ఒకటి కాదు రెండుకాదు అరడజన్- ఇందులో కేషియర్కి వాటా- ఆడిట్ అక్కవుంట్సు బాబులకు చిన్న చిన్న మర్యాదలు సప్లయిలు- యిలా మూడేళ్ళపాటు తినగా తినగా -నేర నిరోధక శాఖవారు పన్నిన వలలోకి వీర్రాజుబాబు కళ్ళుమూసుకుని నడిచివెళ్ళి, ముందు సస్పెన్షన్, ఆపైన చార్జిషీటు, ఎంక్వయిరీలు, చిట్టచివరకు హోల్ డిపార్ట్మెంటంతా తిరగబడి అయివో డబ్ల్యూ వీర్రాజుబాబుని పట్టిచ్చేశారు. అప్పుడు సర్కారు నవుకరీ ఆ విధంగా పోగానే -ఆట్టేకంగాళీ చెయ్యకుండా పెద్ద కంట్రాక్టర్ల దగ్గర చిన్న చిన్న పనులు చేసిపెట్టే బినామీ పిల్ల కంట్రాక్టరుగా వీర్రాజుబాబు అవతారం ఫిరాయించాడు. అయ్యో పాపం మనవాడు అని డిపార్ట్మెంట్ వారుకూడా జాలితలచి వీర్రాజుబాబుకి చిన్న చిన్న సహాయాలు చేశారు. ఆ విధంగా రైల్వేవారి పంచవర్ష ప్రణాళికల ధర్మాన అయితేనేమి, దేశప్రగతిలో భాగస్వామిగా నయితేనేమి, ప్రభుత్వం సాధించిన ఆర్థిక ప్రగతిలో కొంత శాతానికి తను వాటాదారుడయి, బీద కంట్రాక్టరుగావుంటూ "వీర్రాజుబాబు" సొంతానికి మూడుమేడలూ, చిన్న కారూ, రెండు లారీలూ, బ్యాంకుల్లో హార్డ్ క్యాష్ ఐదారులక్షలవరకూ "హార్డ్వర్క్" చేసి సంపాదించేడు.

ఇంత హార్డ్ వర్క్ చేశాక చిన్న పిసరు హార్టువీక్నెసు వుండాలికదా-అందుకని డాక్టర్లు పూర్తి విశ్రాంతి తీసుకోమని వీర్రాజుబాబుకి శలవిచ్చారు. అదిగో అప్పట్నించి పొద్దున్నే ఒళ్ళు తోమించుకోడం, కాలికి ఆవదం రాయించుకోడం, తలంటుపోసుకోడం, మార్నింగ్ వాక్కి వెళ్ళడం, యిల్లు కదలకుండా యింటిపనులు చేయడం- చందమామ, ఇతర

పత్రికలు కొనకుండా పేపర్ బోయ్‌కి డబ్బులిచ్చి నలక్కుండా పుస్తకం చదివి మళ్ళీ యిచ్చేయడం పద్ధతిమీద కొంత కాలక్షేపం ఏర్పాటు చేసుకున్నాడు. వీర్రాజుబాబుకి ఆ పని చేసి పెట్టటానికి చిన్న ఆడతోడు అవసరం గనుక ఆదెమ్మను గృహకృత్యాల్లో వాడుకుంటూ మానవసేవ చేస్తున్నాడు.

హార్టు వీక్నెస్సని డాక్టర్లు భయపెట్టినందున ఆ మధ్యన ఆలిండియా టూర్ వేసుకుని తీర్థయాత్రలు చేసొచ్చాడు సకుటుంబంగా- అప్పుడు ఆదెమ్మ కూడా వస్తానని పేచీపెట్టగా దాన్ని తీసుకెళ్ళి దాని ప్రయాణపు కర్చులు వగైనా వగైరా అమాంబాపతు పదకొండు పన్నెండు వందలు దానిపేర ఖర్చురాసి వుంచాడు . వీర్రాజుబాబులాటి సత్పురుషుడు పదకొండు పన్నెండు వందలు ఆదెమ్మ పేర ఖర్చువ్రాయటం ఏమిటని ఆశ్చర్యం కలుగుతుంది. మనుషులమధ్య సంబంధాలు దైహికమైనవీ ముఖ్యంగా ఆర్థికమైనవీ కూడా అని ఆదెమ్మ పూర్వ చరిత్ర కొంత పరిశీలిస్తే తెలుస్తుంది. వీర్రాజుబాబులాటి పెంటమీద కానీ నాలికతో తీసే బాబు. ఆదెమ్మను ఏల చేరదీశాడని ఆలోచిస్తే వీర్రాజు బాబు బయాగ్రఫీ అచ్చయితే-నూటపదహారో పేజీలో దానికి జవాబుంటుంది. అది అప్పరసా? కాదు. అది వయసులో నున్నదా? లేదు.మరి దేనికి దాన్ని చేరదీయడం? నా దగ్గర డబ్బువుంది. తప్పు-దాన్దగ్గర ఇప్పుడా డబ్బులేదు. అది వీర్రాజుబాబు దగ్గర దాచుకుంది. ఆ డబ్బుతో పాటు అది కూడా వాడి దగ్గరే దాక్కుంది. దాచుకున్న డబ్బుకి పత్రంగిత్రంలేదు. నోటిమాటే- "మేడబాబుకి ముష్టెదవ ఆదెమ్మ ముండ మూడు వేల్రూపాయల డబ్బులేపాటి" అనుకుంది ఆదెమ్మ. వీర్రాజుబాబు అలా అనుకోలేదు. వీర్రాజుబాబుకి మిసెస్సు వుందాలేదా అనే అనుమానం కలగొచ్చు. ఆవిడ వుందికాని వున్నప్పుడు ఆర్నెల్లు ఆసుపత్రిలోనూ, ఆర్నెల్లు పుట్టింట్లోనూ వుంటుందామె. అటు పడగ్గదికీ యిటు వంట గదికీ పనికిరాని మిసెస్సు కావడం వలన నిర్బంధ బ్రహ్మచర్యం, స్వయంపాకం రెండూ మీదపడినప్పటికీ చెక్కు చెదరని భీముడిలా వుండిపోయాడు వీర్రాజుబాబు. మనిషిరిటైరయితే అయాడు కాని లోపలి కోరికలు రిటైరు కాలేదు. చాకీరీకి చవగ్గా ఆడది దొరికితే బావుండ్ను అని అనుకుంటున్న టైంలో ఆదెమ్మ రాజుబాబుతోసహా అంతఃపుర ప్రవేశం చేసింది.

ముందు అంట్లు తోమడంతో ప్రారంభించిన వ్యవహారం వంటలో ఆ పనీ ఈ పనీ అందిపుచ్చుకోడం వరకూ వచ్చాక ఆదెమ్మ బాబుగార్ని సలహా అడిగింది. డబ్బు దాచుకోవడం ఎలాగ అని. వీర్రాజుబాబు డబ్బెక్కడిదే అనీ అడిగాడు. అసిరిగాడి పేరవున్న చిన్న చెక్కను మూడువేలకి బేరం పెట్టినట్టు చెప్పింది. అక్కడ్నుంచి వీర్రాజుబాబు శ్రద్ధగా పళ్ళెంలో కూరలూ అన్నాలు తీసుకెళ్ళి అసిరిగాడికి పెట్టమని పంపించాడు. ఆదెమ్మ రాజుగాడూ కలిసి ఆవిధంగా అసిరిగాడికి మాంసపుకూరలూ చేపల పులుసులూ పలావులూ

తినిపించి అమ్మకపు దస్తావేజుమీద వేలుముద్రలు వేయించారు, ఆ డబ్బు తెచ్చి ఆదెమ్మ బాబుగారి దగ్గర దాచుకుంది స్వల్ప వడ్డీకి.

రాజుబాబుగాడి చదువుకింద ఖాతాలకీ పుస్తకాలకీ బొక్కులకీ డ్రెస్సుకీ, ఆదెమ్మ చీరలకీ స్లిప్పర్లకీ సినిమాలకీ ఆలిండియా టూరుకీ వీర్రాజుబాబు ఎప్పటికప్పుడు ఖర్చులు చెబుతూనే వున్నాడు. కుటుంబంలో ఓ మనిషిలా చూసుగుంటున్నప్పుడు ఆదెమ్మ సరదాకి సర్వెంటుగా వుందేకాని నిజానికి తాను అసిరిగాడి పెళ్ళాన్ననీ, రిక్షావాడి ధర్మపత్నినని అనుకోవడం మానేసింది. వీర్రాజుబాబుకి కూడా పెట్టుబడిలేని సరసంఅంటే హితవే ఆ విధంగా వారు ఆరిన్ రాజు కళావరు రాణీ కలిసిపోయినట్లు కలిసిపోయారు. వంటగదిలోనూ, బాత్రూముల్లోనూ దొండపాదుకిందా, మునగచెట్టు నీడలోనూ రాజుగారి సేవలు చేస్తూ ఆదెమ్మ అప్పర్‌క్లాస్ మనిషితో వ్యవహారం సాగిస్తున్నాననే సంతోషించింది కాని- "గుండ్రాతికి కాళ్ళువచ్చి గునగున నడిచెన్" అన్నట్లు మూడువేల రూపాయలకు కాళ్ళువచ్చి నడుస్తాయనుకోలేదు!

ఏం జరిగిందంటే-

సెలవులకు యింటికొచ్చిన అప్పారావు ఎమ్మెస్సీ జూఆలజీకి తండ్రి వీర్రాజుతో ఆదెమ్మ అనబడే పనిమనిషి అంతచనువుగా వ్యవహరించడం సుతరామూ గిట్టలేదు. తనతండ్రి ఆఫ్టరాల్ ఒక పనిమనిషితో అంతలా యిజీ గోయింగ్‌గా వుండటం కూడా అతనికి చిన్నతనంగా సిల్లీగా మరియు డర్టీగాతోచింది. అసిరిగాడు తాగొచ్చి మేడముందు నిలబడి తను మేడను చూసయినా భయపడకుండా "నా పెళ్ళాన్ని నా కిచ్చీరా ఎదవా" అని తిడుతున్నప్పుడు విన్న అప్పారావు, ముందు తండ్రిని హత్యచేసి బై రాగి దుస్తులు వేసుకుని హిమాలయాలకి వెళ్ళిపోదామనుకున్నాడు. కాని తర్వాత అభిప్రాయాన్ని మార్చుకున్నాడు వీర్రాజుబాబు నెలకి రెండుసార్లు హైదరాబాద్ వెళ్ళి అక్కడ రెండుమూడ్రోజులుండి వస్తుంటాడు అక్కడ అతనికో చిన్నహ్యూమ్‌పైప్ ఫ్యాక్టరీవుంది. అది లీజుకిచ్చాడు. కాని వచ్చి సూపరువైజు చేస్తే కొంతపర్సంటేజి కమిషన్ యిస్తామన్నారు- అందుకని వచ్చేది పోగొట్టుకోవడం యిష్టంలేక తాళాలు వేసి తను వచ్చేలోగా ఏయేపనులు చేయాలో ఎంత ఖర్చుపెట్టాలో ఒక లిస్టురాసిచ్చి వెళ్ళిపోతుంటాడు. అలా అతడు హైదరాబాద్ వెళ్ళేముందు ఆదెమ్మకు రెండొందలు యివ్వటం అప్పారావు యమ్మెస్సీ గమనించి కుతకుతలాడిపోయేడు. వీర్రాజుబాబటు వెళ్ళగానే ఆదెమ్మ జల్సాగా తిరగడానికి వెళ్ళిపోయింది. వెంటనే అప్పారావు ఇంట్లో బల్లమీద పెట్టిన రెండొందర్లూపాయలు పోయాయని పోలీసు రిపోర్టిచ్చి ఆదెమ్మమీదే అనుమానంగా వుందని దాన్ని లాకప్‌లో పెట్టించాడు. పోలీసువాళ్ళు దాన్ని తన్ని నీ కెక్కడిదే డబ్బు అంటే ముందు చెప్పకపోయినా

తరవాత- వీర్రాజుబాబు నన్నుంచుకున్నాడు నాకిచ్చాడు డబ్బు అందది అప్పారావుకి కళ్ళు తిరిగిపోయేలా-

"అది రోడ్‌సైడు బిచ్చి. దాని మాటల్ని నమ్మకండి" అన్నాడు అప్పారావు. మీ ఫాదరొచ్చాక వెరిఫై చేద్దాం అన్నాడు యస్.ఐ. వీర్రాజుబాబు ఎంత లోఫరయితే మటుకు దాన్నుంచుకున్నానని చెప్తాడా? చెప్పడుగాక చెప్పడు.

II

"ఆదెమ్మని అల్ల మేడబాబు కొడుకు జైల్లో తోయించేసినాడు, అని ఉప్పుబస్తాలు లాగేవాళ్ళు ఉప్పుబస్తాల కంట్రాక్టరు నాయుడి దగ్గరకొచ్చి అన్నారు. నాయుడు మురికికాలవమీద అడ్డంగా వేసిన నులక మంచం మీద కూర్చుని బొక్కి పెనసల్తో ఎక్సరు సైజు పుస్తకంలో ఉప్పు లెక్కలు రాస్తూ వూకొట్టాడు.

"అల్ల మేడబాబు కొడుకు మాటలట్టుకుని అన్నాయంగా ఆడదాన్ని పోలీసులు జైల్లో ఎట్టిస్తే కబురు యినీ మాట్లడవేటి నాయుడు బాబూ" అని ఓ ఆడమనిషి జుత్తు ఎగదోసుకుంటూ అడిగింది.

మళ్ళీ నాయుడు "ఊ" అన్నాడు సిలిండర్లా కదలకుండా. నాయుడు బాబు మాట్లాడకపోవటంలోని మతలబును గ్రహించినట్లు రోజు "కూర తగూ" తీర్చే ముసల్ది "దాని మొగుడున్నాడు! దాని కొడుకున్నాడు. ఆల్లకి పట్టకపోతే మనకేటి? అవునా బాబూ అదేనా నీ ఉద్దేశమూ" అని దీర్ఘం తీసింది.

మళ్ళీ "ఊ" అన్నాడు నాయుడుబాబు.

"అద్సరేగాని ఎడ్డుబాబూ నాను తెలకడుగుతాను. మేడబాబే కొడుకుసేత ఈముండ నాదులుకోడానికి చోరీ కేసెట్టించి నాడంటావా?" అని లా పాయింటు తీశాడు మరో ఉప్పమ్మే కూలీ.

పెనసలు ముక్కని జోబీలోకి తోసి, బీడి ముట్టించి హేడుబాబు దీర్ఘంగా నిట్టూర్చి, తన నిశ్శబ్దంవలన వచ్చిన ఎఫెక్టును పూర్తిగా పరిశీలించి యిలాగన్నాడు.

"రాజుబాబును అయిదరాబాదు తోలేను."

"ఆహ్హా...అయిదరాబాదెందుకు?"

"ఎల్లి ఆ మేడబాబు కాళ్ళుచ్చుకో మన్నాను."

"రైటే- ఆ బాబొస్తే యిడిపిస్తాడు గావల్ను" అంతలో మరో గొంతుక లేచింది.

"శస్- ఏంపని జేసినావయ్యా ఎడ్డుబాబూ? ఈ ముండకోసం ఆ బాబు అయిదరాబాదొగ్గీసి పారొస్తాడంటావా?"

దానికి జవాబుగా మరో ఆసామీ-

"కుర్రాడా- లేప్పోతే కోరట్లోకూడా ఆనక ఆ బాబు పేరుజెబితే పరువేటైపోనూ- ఆ బాబు పారొస్తాడు- రాప్పోతే నేన్నెవి కోయిస్తా."

"ఆ బాబొచ్చి కేసు తీయించేస్తాడు" అన్నాడాలోచనగా మరొక ఉప్పు బస్తాలవాడు.

ఆ మంచం చుట్టూ కూర్చున్న మనుషుల్లో ఆడవాళ్ళు మాత్రం ఆ బాబు పేరెత్తి ఉంచుకున్నాడని చెప్పడం "మర్రేదా లచ్చనం" కాదన్నారు. దాన్తో రెచ్చిపోయిన వాడొకడు-

"మరేద్రా లచ్చనం కాకపోతే అదలా గనకపోతే ఆ మేడబాబు కదిలిరాడు. నీకు డబ్బెక్కడిదే లంజా అంటే నా డబ్బే అంటే పోలీసోడు నమ్ముతాడా? నమ్మడు, నమ్మడు. ఆదెమ్మ తెలివైందే. అవును కదా ఎడ్డుబాబూ- నా పాయింటు కరకటేనా?"

"కరకటే" అన్నాడు ఎడ్డు నవ్వుతూ.

II

రాజుబాబుకి పదమూడేళ్లుంటాయి. చాకులావుంటాడు. శుభ్రంగా ఇస్త్రీమడత లేస్తాడు. తల నున్నగా దువ్వుతాడు. కాళ్ళకు బెల్టుచెప్పులు తొడుగుతాడు. వాడి శరీరచ్ఛాయ కూడా నలుపుకాదు, చామన చాయ. వాడు ఫస్టుఫాం పాసయి సెకండ్‌ఫాంలో కొచ్చేడు. మేడబాబింట్లో ఆ పనీ యీ పనీ సహాయంచేస్తూ తిరుగుతూ ఏ దీపం వెలిగితే ఆ దీపంకింద కాస్సేపు కూర్చుని చదువుకునేవాడు. ఏ వరండాలో ఎవరు దీపం వేసినా కాస్సేపు చదువుకుంటానని ఆ కుర్రాడు హోం వర్కూ పాఠాలు కంఠతాబట్టడం చేసేవాడు. చూస్తే ముత్యం లాగుండే ఆ కుర్రాడు చదువుకు ఖర్చు చాలా అవుతున్నదనే విషయం గ్రహించాడు. చదువుతో, చదువుకున్నవారి అలవాట్లతో మధ్యతరగతి స్వభావాన్ని అలవాటు చేసుకోడం తప్పని తెలుసుకున్నాడు.అలా తెలుసుకోడంలో నేనెవడ్ని అని అనుకున్నాడు. అంట్లుతోమే ఆదెమ్మ కొడుకుని. మరింకా నే నెవడ్ని? రిక్షాలాగే తాగుబోతు అసిరిగాడి కొడుకుని. చదువు లెవరికి? డబ్బు ఖర్చు చెయ్యగల వారికి? చదువులు మంచివే కాని పదేళ్ళు పనీ పాటా సంపాదనా లేకుండా క్లాసులమీద క్లాసులు చదువుతూ కూర్చుంటే తిండి నోటి దగ్గరకు రాదు. పదేళ్ళలో లారీ డ్రైవరు కావచ్చును. సైకిలు షాపెట్టుకుంటే సైకిళ్ళ బిజినెస్ రాజాలా నడపొచ్చును. మరింకా దేవుడు మేలుచేస్తే ఏ గేరేజిలోనన్నా చేరి మోటారు మెకానిక్కు కావచ్చును. కాని ఈ జాగ్రఫీ, సోషల్, సైన్స్, హిందీ, తెలుగూ కలగావులగం చదివి ఏదో తరగతి ప్యాసైతే అది ఎందుకూ బతకడానికి పనికిరాదు. పైగా ఈ చదువు డబ్బు ఖర్చుతో కూడకొన్నది. చదువు మంచిదే కాని యీ చదువులు మంచివికావు. లోకంలో బతకడ వెలాగో చెప్పేదే నిజమైన చదువు.

ఈ రకంగా ఆలోచించాక రాజుబాబు, మరింక నేను చదువుకోను అని తీర్మానించుకుని ఎవరెన్ని విధాలుగా పుస్తకాలకు డబ్బిస్తానన్నా, జీతాలు కడతామన్నా, స్కాలర్‌షిప్పు యిస్తామన్నా అన్నీ నిరాకరించేడు.

రాజుబాబుకి వ్యాపారం అంటే సరదా? వాడు ఫస్టుఫాంలో వున్నప్పుడే పది రూపాయలు దీపావళి సామానుకొని వీధిలో గోనెపట్టా వేసుకు కూర్చుని అవన్నీ చుట్టుపక్కల పిల్లలకి అమ్మి రెండు రూపాయలు లాభం సంపాదించి ఆ వచ్చిన లాభంతో టపాకాయలు కొని కాల్చుకునేవాడు.

ఆ చుట్టుపక్కల కుటుంబాలవారికి లాండ్రీనుంచి బట్టలు తెచ్చి పెట్టడం చిన్న చిన్న బజారుపనులు చేసి పెట్టడంలాటి సర్వీసులు చేసేవాడు. ఆడాళ్ళకు ఆడపనులూ మగవారికి మగపనులూ చేసిపెట్టేవాడు. రాజుబాబుని తమ వర్గానికి చెందిన వ్యక్తిగా అంతా అనుకునేవారు. ఆ అబ్బాయి కూడా పనులు చేసిపెట్టినందుకు డబ్బులు తీసుకునేవాడు కాదు. ఎవరేది పెట్టినా వద్దనేవాడు.

అలా చదువు మానేసిన రాజుబాబు చదువుకాదు, బతకటానికి చేతిలో విద్య వుండాలని మోటారు మెకానిక్కు దగ్గర పనిలో ప్రవేశించాడు. మెకానిజం సంగతి దేవుడెరుగును కాని మోటారు మేస్త్రీలు తమ దగ్గర చేరిన కుర్రాళ్ళని రోజూ నెత్తురు కళ్ళచూస్తారు. వాళ్ళని ఎంత హింసపెడితే తామంత గొప్పగురువులైనట్లుగా భావిస్తారు. తమర్ని తమ గురువులెలాగ రెంచీలతో సుత్తులతో కొట్టేవారో చెప్పి ఇప్పటి కుర్రాళ్ళు పనిదొంగలు శుద్ధసన్యాసులని చెప్పటం వారికదో సరదా. క్లీనర్లని డ్రయివర్లూ, యల్డీసీలని యూడీసీలూ, కోడళ్ళని అత్తలూ అలానే హింసిస్తారు. ఇలా వర్కుషాపుల్లో చేరే కుర్రాళ్ళు కొన్నాళ్ళకు పనివాళ్ళేనా అవుతారు, లేదా పారిపోయి దొంగలూ కేడిలుగానేనా మారుతారు.

ఆవేళ రాజుబాబు కారుక్రింద ఏదో డిఫెక్టు సరిచేయటం కోసం దూరిన మేస్త్రీకి సహాయపడుతూండగా–

"ఒరే రాజూ, మీ అమ్మని పోలీసులు లాక్కెళ్ళారా" అని కబురొచ్చింది. రాజుబాబు మేస్త్రీకి చెప్పి పోలీస్టేషను కెళ్ళాడు. ఆదెమ్మని అప్పటికప్పుడే లాకప్పులో పెట్టారు. రాజుబాబుగాడ్ని పోలీసులు ఆదెమ్మను చూడనివ్వలేదు. రాజుబాబు ఉప్పుబస్తాల నాయుడి దగ్గరికి పరిగెత్తి "మా అమ్మని పోలీసోళ్ళు ఎత్తికెళ్లార"ని చెప్పాడు. అప్పుడు ఆ నాయుడుబాబు స్టేషనికెళ్ళి దెబ్బల్తిని ఏడుస్తూ మూలుగుతున్న ఆదెమ్మకి ఏదో చెప్పాడు. బయటికొచ్చి రాజుబాబును హైదరాబాదెళ్ళి ఆ బాబును తీసుకురమ్మని పంపాడు.

II

అప్పుడు కథేమయిందిసార్?

రాజుబాబుకి వీర్రాజుబాబేం సమాధానం చెప్పాడు?

ఆదెమ్మ జైల్లోంచి బయటికొచ్చిందా?

అసిరిగాడూ ఆదెమ్మో కలుసుకున్నారా?

నాయుడు ఆదెమ్మకి చేసిన ఉప్పుదేశం సారాంశ మేమి?

అప్పారావు యమ్మెస్సీ జూఆలజీ ఏం చేస్తున్నాడు?

-అప్పారావు జూఆలజీ ఎమ్మెస్సీ అమెరికాలో ఏదో డాక్టరేట్‌కి పి యల్. 40....నిధులు సహకారంతో యిచ్చే స్కాలర్‌షిప్పులమీద రీసెర్చి చేస్తున్నాడు.

-నాయుడే ఆ బాబు నన్నుంచుకున్నాడని చెప్పమని ఆదెమ్మకి ఉపదేశం చేశాడు. అది బెడిసికొట్టింది.

-అసిరిగాడు టీ. బీ. వచ్చి చచ్చిపోయేడు.

- చోరీ కేసులో ఆదెమ్మకు ఆర్నెల్ల కఠిన నరకం జైలడింది.

-రాజుబాబు హైదరాబాద్ నగరంలో వీర్రాజు బాబుని కలుసుకోలేకపోయేడు. ఆ రోజూ ఆ మర్నాడూ తిరిగినా-

-ఇప్పుడు రాజుబాబుగాడేం చేస్తున్నట్టు?

-మోటారు మెకానిక్కుల చిత్రహింసలు భరించలేక ఏదో సినిమాహాల్లో గేటు దగ్గర టిక్కెట్టుముక్కలు చింపుతున్నాడు.

మరి ఆదెమ్మ జైలునుంచి తిరిగొచ్చిందా?

-ఆహ్వా! మరో పేటలో నాలుగిళ్ళలో పాచిపనులు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నది.

మరి ఆదెమ్మ మూడువేలూ ఏమయ్యాయి సార్?

-వీర్రాజుబాబు కడుపుతోన్న ఇనప్పెట్టెలో అవి భద్రంగా మూలుగుతున్నాయ్.

ఛ! కథేం బాగులేదుసార్!